www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 10 జులై 2023

5

ఏలూరు

నేడు యథావిధిగా 'స్పందన'

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల 10వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో 'స్పందన' కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరగనున్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ, మాస్కు తప్పనిసరిగా ధరించి సామాజిక దూరం పాటించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలేవీ

- అనారోగ్యంతో 300 మంది పడిపోతే ఏళ్లు గడుస్తున్నా కానరాని రిపోర్టు
- జ్యుట్‌మిల్లు మూతపడి పది వేల మంది ఉపాధి కోల్పోతే పట్టించుకోరా
- కార్పొరేషన్‌లో అవినీతిపై జెసి నివేదికపై చర్యలేవీ
- అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి ఏఒక్క అభివృద్ధీ లేదాయె
- విషతుల్యంగా మారుతున్న కొల్లేరును రక్షించుకోవాలి
- ఏలూరు పర్యటనలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

జగన్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని, ప్రభుత్వాసుపత్రులను చిదిమేస్తుందని, ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్లుగాని, యంత్రాలుగాని ఏ ఒక్కటీ లేకపోవడంతో ప్రజలకు వైద్యసదుపాయాలు అందకుండా పోయాయని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తెలిపారు. వారాహి రెండోవిడత యాత్రను ఆయన ఆదివారం ఏలూరు నుంచి ప్రారంభించారు. మధ్యాహ్నం నాలుగు గంటలకు పవన్ కలపర్రు టోల్‌గేట్ వద్దకు చేరుకోగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జనసైనికులు ఘనస్వాగతం పలికారు. యువత బైక్‌ర్యాలీతో ముందుకుసాగగా మినీ బైపాస్‌లోని క్రాంతి కల్యాణ మండపానికి చేరుకున్నారు. అనంతరం 6.20 గంటలకు కల్యాణ మండపం నుంచి పాత్‌బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభాస్థలికి చేరుకున్నారు. అక్కడ సభలో పవన్ మాట్లాడుతూ మద్యనిషేధం అని చెప్పి అత్యధికంగా రూ.లక్షా 25 వేల కోట్లు ఆదాయం రాబట్టిందని విమర్శించారు. దీనిలో రూ.30 వేల కోట్లు లెక్కలు లేవన్నారు. జంగారెడ్డిగూడెంలో 32 మంది కల్తీసారా తాగి చనిపోయారన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్రానికి రూ.250 కోట్లు ఇచ్చిందని, అందులో రూ.15 కోట్లు ఖర్చుచేస్తే ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు అందించవచ్చునన్నారు. ఆసుపత్రుల్లో టాబ్లెట్‌లు కూడా అందించలేని పరిస్థితి ఉందన్నారు. స్త్రీ శిశుసంక్షేమ, దివ్యాంగుల సంక్షేమానికి ఉపయోగించాల్సిన రూ.537 కోట్లు ఖర్చుచేయలేదన్నారు. ఏలూరులో 300 మందికిపైగా తల తిరిగి అనారోగ్య సమస్యతో పడిపోతే ఇప్పటికీ దానిపై రిపోర్టు లేదన్నారు. ఏలూరు కార్పొరేషన్‌లో అవినీతిపై జెసిగా పనిచేసిన అరుణ్‌బాబు 1800 పేజీల రిపోర్ట్ తయారు చేసినా దానిపై చర్యలు లేవన్నారు. సదరు అధికారిని బదిలీ చేశారన్నారు. ఏలూరులో 300 పడకల ఆసుపత్రి ఘోరంగా తయారైందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ లేదన్నారు. అమృత పథకంలో రూ.37 కోట్లు వచ్చినా ఖర్చుచేయలేదన్నారు. అనంతపురం నుంచి వచ్చిన వ్యక్తి ఏలూరులో ఇళ్లు నిర్మిస్తామని డ్వాక్రా మహిళల నుంచి రూ.35 వేలు చొప్పున దోచేసిన అడిగే నాథుడు లేడన్నారు. డిగ్రీ కాలేజీకి భవనం లేకుండా పోయిందని, రూ.80 కోట్లతో ప్రతిపాదనలున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఏలూరులో 500 టన్నుల నిమ్మ పంట కొనుగోళ్లు జరుగుతాయని ఇక్కడ కోల్డ్ స్టోరేజ్‌గానీ, సరైన ధర అందించే ప్రక్రియగానీ లేకుండాపోయిందన్నారు. జ్యూట్‌మిల్లు మూతపడినా పట్టించుకోవడం లేదన్నారు. క్రొల్లేరు సరస్సును కాపాడుకుని పర్యావరణాన్ని రక్షించుకోవాలన్నారు. అనాధ శవాలకు దహన సంస్కారాలు చేసే ఫ్లాష్ టీంను చిదిమేశారన్నారు. అభివృద్ధి జరగాలన్నా, అరాచకం పోవాలన్నా ఈ ప్రభుత్వం మారాలన్నారు. ఐదు గంటలకు ప్రారంభం కావాల్సిన సభ 8 గంటల వరకూ ప్రారంభం కాకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పవన్‌కు జన నీరాజనం

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

జనసేన అధినేత కొణిదల పవన్‌కళ్యాణ్ చేపట్టిన వారాహి విజయయాత్ర జిల్లా కేంద్రమైన ఏలూరులో ఆదివారం విజయవంతంగా ప్రారంభమైంది. నగర ప్రజలు ఘనస్వాగతం పలికారు. రోడ్ల పొడవునా నిల్చొని నీరాజనాలు పలికారు. నగరంలో ప్రధాన రహదారులన్నీ జనసైనికులు, అభిమానులతో నిండిపోయాయి. విజయవాడ నుంచి రోడ్డు మార్గంలో ఏలూరు చేరుకున్న పవన్ కళ్యాణ్‌కు కలపర్రు టోల్‌గేట్ వద్ద జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యాన జనసైనికులు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి భారీ ద్విచక్ర వాహన శ్రేణితో వట్లూరు హైవే మలుపు వద్ద ఉన్న ఎస్‌వి.రంగారావు కాంస్య విగ్రహం వద్దకు చేరుకుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి క్రాంతి కల్యాణ మండపానికి చేరుకున్నారు. అభిమానులు పెద్దసంఖ్యలో క్రాంతి కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం వారాహి యాత్ర ఆలస్యంగా ప్రారంభమైంది. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కావాల్సిన యాత్ర ఆరు గంటలకు ప్రారంభమైంది. ఈలోపు యువత క్రాంతి కల్యాణ మండపం నుంచి గ్రీన్‌సిటీ వరకు ద్విచక్ర వాహనాలతో హల్‌చల్ చేశారు. ఐదు గంటల సమయంలో పవన్ బయటికి వచ్చినా మళ్లీ లోనికి వెళ్లి జనసేన తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్‌తో భేటీ అయ్యారు. ఆరు గంటలకు యాత్ర ప్రారంభించారు. వారాహి వాహనంపై కాకుండా ఫోర్డ్ టాప్‌లెస్ కారులో బయటికి వచ్చారు. అక్కడ క్రేన్ సాయంతో పవన్‌కు గజమాల వేశారు. ర్యాలీ మినీ బైపాస్ నుంచి గ్రీన్‌సిటీ, శాంతినగర్, కొత్తబస్టాండ్, జ్యూట్‌మిల్ మీదుగా పాత బస్టాండుకి చేరుకుంది.

సమర శంఖం..

- ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అంగన్‌వాడీలు సమాయత్తం
- బడ్జెట్లో కోతలు.. అమలకు నోచుకుని హామీలు
- నేడు, రేపు కలెక్టరేట్ల వద్ద 36 గంటల నిరవధిక ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై అంగన్‌వాడీలు సమరశంఖం పూరించారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సమాయత్తమయ్యారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు చూసిచూసి కడుపు తరుక్కుపోయిన అంగన్‌వాడీలు తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపేందుకు శ్రీకారం చుట్టారు. 36 గంటలపాటు నిరవధిక ధర్నా చేపట్టేందుకు పూనుకున్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టబోయే నిరసనలో వేలమంది అంగన్‌వాడీలు భాగస్వాములయ్యేందుకు సమాయత్తమయ్యారు.

గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామీణ ప్రజానీకానికి ఎన్నో సేవలందిస్తున్నాయి. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు చిన్నారుల ఆలనా పాలనా చూసి వారి బంగారు భవిష్యత్తుకు ప్రాథమిక విద్యనందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. అయితే ఈ కేంద్రాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. కీలక రంగంలో మెరుగైన సేవలందిస్తున్న అంగన్‌వాడీలు అనేకరకాల సమస్యలతో సతమతమవుతున్నారు. జిల్లాలో మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 70, మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 1500 వరకూ ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ఆయాలు, టీచర్లు కలిపి సుమారు 3 వేల మంది వరకూ పనిచేస్తున్నారు. అయితే ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల ఉదాశీనంగా వ్యవహరిస్తోంది. ఉద్యోగ భద్రత నుంచి గ్రాడ్యుటీ వరకూ అనేక సమస్యలతో వారు సావాసం చేస్తున్నప్పటికీ వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఈ నేపథ్యంలో ఐసిడిఎస్ పరిరక్షణ, అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పింఛను, పిఎఫ్, ఇఎస్‌ఐ, గ్రాడ్యుటీ అమలు చేయడంతో పాటు ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 10వ తేదీన కోర్కెల దినం పురస్కరించుకుని పోరాటాన్ని ఉధృతం చేయాలని అఖిల భారత కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జిల్లాలో అంగన్‌వాడీలు 36 గంటల పాటు నిరవధిక ధర్నా చేపట్టేందుకు సిద్ధమయ్యారు. సుమారు 2 వేల మందిపైబడి అంగన్‌వాడీలు ధర్నాలో భాగస్వాములయ్యేందుకు సమాయత్తమయ్యారు.

ప్రకటనలకే పరిమితం..

అంగన్‌వాడీల సమస్యల పట్ల యూనియన్ ఆధ్వర్యంలో అనేక రూపాల్లో దశలవారీ పోరాటాలు చేయడం జరిగింది. ఈ పోరాటాల ఫలితంగా 2018లో అంగన్‌వాడీ వర్కర్లకు రూ.1500, హెల్పర్లకు రూ.750, మినీ వర్కర్లకు రూ.1,250 వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం ప్రకటించింది. అయితే నేటికీ హామీ ప్రకటనకే పరిమితమైంది. ఇదిలా ఉంటే 2017 నుంచి ఇప్పటివరకూ టిఎ బిల్లులు కూడా ప్రభుత్వం చెల్లించలేదు.

ఐసిడిఎస్ లక్ష్యానికి కేంద్రం తూట్లు

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఐసిడిఎస్ లక్ష్యానికి తూట్లు పొడుస్తోంది. అధికారం చేపట్టి తొమ్మిదేళ్లయినా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తోంది. ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించడానికి నూతన విద్యావిధానాన్ని తీసుకొచ్చి అమలు చేస్తోంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే ఇటీవల కాలంలో ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. అయితే పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు నయా పైసా కూడా పెంచిన దాఖల్లాలేవు. 2022 ఏప్రిల్‌లో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు దేశ వ్యాప్తంగా అంగన్‌వాడీలు 1972 చట్టం ప్రకారం గ్రాడ్యుటీకి అర్హులని చెప్పినప్పటికీ అమలు కావడం లేదు. ఇలాఉంటే లబ్ధిదారులను కుదించడానికి పోషణ ట్రాక్ యాప్ తీసుకొచ్చారు. ప్రయివేటీకరణ విధానలు అమలు చేస్తూనే రకరకాల యాప్‌లు తీసుకొచ్చి విపరీతంగా పనిభారం పెంచింది. 2023-24 గాను ప్రవేశపెట్టిన బడ్జెట్ సైతం తీవ్ర అసంతృప్తిని మిగిల్చింది. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లతో పాటు స్కీం వర్కర్లకు ఈ బడ్జెట్ ప్రయోజనం చేకూర్చలేదు.

అమలు కానీ ముఖ్యమంత్రి జగన్ హామీ

మాట ఇచ్చాక మడమ తిప్పనని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి జగన్ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీ నీటి మూటలు గానే మిగిలిపోయింది. తెలంగాణా కంటే అదనంగా వేతనాలిస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదు. నవరత్నాల పేరుతో నూటికి 98 శాతం హామీలు అమలు చేశామని చెబుతున్నా ప్రభుత్వం అంగన్‌వాడీల హామీ ఎందుకు నెరవేర్చలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

డిమాండ్లు ఇవే..

- అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలి.
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలి. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలి. వేతనంలో సగం పింఛను ఇవ్వాలి.
- అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలి.
- .హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలి. ప్రమోషన్లలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలి.
- 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. వర్కర్లతో సమానంగా వేతనాలివ్వాలి. మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి.
- వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలి.
- వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలి. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలి. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలి.
- సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి, బీమా అమలు చేయాలి.
- లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలి. ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలి.

టిసిల జారీలో ఇబ్బందులు పెడితే చర్యలు

ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్‌బాబు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు బదిలీ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు కళాశాల యాజమాన్యాలు డబ్బులు అడిగినా, ఇతర ఇబ్బందులకు గురిచేసినా తనకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ఎలా సాగుతుంది.. కనీస సౌకర్యాలు లేని కళాశాలలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు తదితర ప్రశ్నలకు ప్రజాశక్తి 'ముఖాముఖి'లో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: ఉమ్మడి జిల్లాలో ఏ ఏ యాజమాన్యాల పరిధిలో ఎన్ని ఇంటర్ కళాశాలలు ఉన్నాయి?

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు 34, ప్రయివేటు కళాశాలలు 170, ఎయిడెడ్ కళాశాలలు 5, సోషల్ వెల్ఫేర్ కళాశాలలు 9, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలు 3, కస్తూర్బా బాలిక విద్యాలయాలు 3, ఇతర యాజమాన్యాలతో కలిపి మొత్తం 273 కళాశాలలు ఉన్నాయి.

ప్రశ్న: ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ఎలా సాగుతుంది? ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారా? అడ్మిషన్లు పెంచేందుకు ఏమైనా చర్యలు తీసుకున్నారా?

ప్రభుత్వ కళాశాలల్లో ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు 714 అడ్మిషన్లు జరిగాయి. ఒక రకంగా చెప్పాలంటే ఇది తక్కువే అని చెప్పొచ్చు. విద్యార్థులు ఎక్కువగా ప్రయివేట్ కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఆయా కళాశాలల పరిధిలో ప్రచారం చేయటం, విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుంది.

ప్రశ్న. ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచడానికి అదనపు తరగతులు నిర్వహించటం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం, ప్రత్యేక శిక్షణ, క్రమం తప్పకుండా క్లాసులకు హాజరయ్యేలా చూడటం, ఎవరైనా క్లాసులకు సరిగ్గా హాజరు కాకపోతే విద్యా వాలంటీర్ల ద్వారా వారి తల్లిదండ్రులతో మాట్లాడి కళాశాలకు హాజరయ్యేలా చేయడం వంటి చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న: ప్రయివేట్ కళాశాలల్లో అధిక ఫీజుల వసూలుపై విద్యార్థులు గగ్గోలు పెట్టడమే కాకుండా విద్యార్థి సంఘాలు కూడా అనేక పోరాటాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫీజుల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రయివేట్ కళాశాలల్లో ఫీజులపై ప్రత్యేక నిబంధనలు లేవు. కళాశాలల యాజమాన్యాలు నిర్ణయించిన ఫీజులు తల్లిదండ్రులకు ఇష్టమై కడుతున్నారు. దీనిపై ప్రభుత్వం నిబంధనలు తీసుకొస్తే మేం అమలు చేస్తాం.

ప్రశ్న: ప్రయివేట్ కళాశాలల్లో ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు బదిలీ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు యాజమాన్యాలు డబ్బు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

నిబంధన ప్రకారం బదిలీ సర్టిఫికెట్లు పొందేందుకు యాజమాన్యాలకు ఎలాంటి సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడి చేస్తే విద్యార్థులు నేరుగా నాకు ఫిర్యాదు చేయవచ్చు. వెంటనే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఉమ్మడి జిల్లాలో అనుమతులు లేని కళాశాలలుగాని, కనీస సౌకర్యాలు లేని కళాశాలలుగాని ఎన్ని గుర్తించారు? రెగ్యులర్‌గా తనిఖీలు చేస్తున్నారా? ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జిల్లాలో ఇప్పటివరకు 57 కళాశాలలపై తనిఖీలు నిర్వహించాం. అనుమతులు లేని రెండు కళాశాలలు గుర్తించాం. అలాగే వీటిలో కొన్నింటికి అనుమతులు ఉంటే మరికొన్నింటికి అనుమతులు లేని పరిస్థితులు ఉన్నాయి. ఆ వివరాలన్నీ ఇంటర్మీడియట్ బోర్డుకు పంపించాం. బోర్డు నుంచి ఆ కళాశాలకు నోటీసులు పంపి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ప్రశ్న: ఇంటర్ కళాశాలల్లో చదివే అర్హులైన విద్యార్థులందరికీ అమ్మఒడి వస్తుందా?

ఈ విషయంలో సరైన సమాచారం లేదు. కళాశాలల నుంచి సమాచారం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రశ్న: ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

నాడు-నేడు కార్యక్రమం ద్వారా అన్ని ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మరుగుదొడ్లు, తాగునీటి కోసం ఆర్ఒ ప్లాంట్స్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇప్పటికే చాలా కళాశాలల్లో నిర్మాణ దశలో ఉన్నాయి. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు నాడు-నేడు ద్వారా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

మండుతున్న కూరగాయల ధరలు

విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎండల ప్రభావంతో కూరగాయల పంటలు దెబ్బతినడంతో కూరగాయల ధరలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. దీంతో వర్షాలు ఎప్పుడు కురుస్తాయా అని కూరగాయల సాగుదారులతోపాటు సామాన్య ప్రజలు సైతం ఎదురుచూస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే కూరగాయల సాగు చేపట్టేందుకు అవకాశం ఉంది. ఒకప్పుడు వర్షాకాలంలో ఇంటి పెరట్లో ఆకుకూరలతో పాటు కూరగాయలు సాగు చేసేవారు. తొలకరి వర్షాలు జూన్‌లో కురవలేదు. జులై పదో తేదీ వచ్చినా వర్షాలు పెద్దగా కురవకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. సాగు చేస్తే కూరగాయల రైతులను ప్రోత్సహింహించాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎంతైనా ఉంది. మండలంలోని చిగురుకోట, నరసన్నపాలెం, కొడగుంటపాలెం, రాజానగరం చౌదరి గ్రామాల్లో ఎక్కువగా ఆకుకూరలు సాగుచేసేవారు. అందుచేత ప్రజలకు అందుబాటులో ఉండడంతోపాటు తక్కువ ధరలకు దొరికేవి. క్రమంగా విస్తీర్ణం తగ్గడంతో పాటు ప్రభుత్వం ప్రోత్సాహం అంతంత మాత్రంగానే ఉండటంతో పరిస్థితులు మారాయి. ప్రధానంగా కూరల్లో ఉపయోగించే పచ్చిమిర్చి, అల్లం, టమోటా ధరలు రూ.వందకుపైగా ఉన్నాయి. మిగిలిన వంకాయ, బీర, బెండకాయ ధరలు కిలో రూ.80 పైబడి పలుకుతున్నాయి.

తల్లాపురంలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలి

ఎంఎల్‌ఎకు గ్రామస్తులు మొర

ప్రజాశక్తి - ఉంగుటూరు

తల్లాపురంలో మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉందని సీసీ డ్రెయిన్లు, సిమెంటు రోడ్లు నిర్మించాలంటూ ఆ గ్రామస్తులు ఎంఎల్‌ఎ వాసుబాబు, ఎంపీ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. శనివారం రాత్రి తల్లాపురంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహ ఆవిష్కరణ, జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, మాజీ సర్పంచి, వైసిపి నాయకుడు పైడిముక్కల రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమడోలు ప్రాజెక్టు పరిధిలోకి..

భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు మండలాలు

ప్రజాశక్తి - భీమడోలు

ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయాల పునర్విభజనలో భాగంగా భీమడోలు ప్రాజెక్టు పరిధిలో భీమడోలుతో పాటు ఉంగుటూరు, నిడమర్రు మండలాలు చేరాయని భీమడోలు సిడిపిఒ కెవి.విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇంతవరకూ కార్యాలయ పరిధిలోని ద్వారకాతిరుమల మండలం జంగారెడ్డిగూడెం సిడిపిఒ కార్యాలయానికి, దెందులూరు మండలం పెదపాడు సిడిపిఒ కార్యాలయం పరిధిలోకి బదిలీ అయ్యాయని చెప్పారు. కార్యాలయాల పునర్విభజన అనంతరం భీమడోలు ప్రాజెక్టు పరిధిలో 196 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో 9 మినీ కేంద్రాలు ఉన్నాయన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించే ప్రాథమిక పూర్వ పాఠశాలల్లో ఇంతవరకూ 549 మంది పిల్లలు చేరారన్నారు. ఆరేళ్లు నిండిన తర్వాత అంగన్వాడీ కేంద్రం నుంచి బయటకెళ్లిన వారిలో 637 మంది ప్రభుత్వ పాఠశాలలో, 687 మంది ప్రయివేటు పాఠశాలల్లో చేరారన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి వారికే కేటాయించిన టేకు హోమ్ పద్ధతిలో అందజేస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కిశోర్ బాలికలు ఇతరులకు కార్యాలయం ద్వారా అవగాహన సదస్సు సహకారాలు అందజేస్తున్నామన్నారు.

రొయ్యల చెరువు తవ్వకం ఆపాలి

మానవ హక్కుల వేదిక

ప్రజాశక్తి - మండవల్లి

దళితులపై బెదిరింపులకు పాల్పడి అనుమతులు లేకుండా చేపట్టిన రొయ్యల చెరువు తవ్వకాన్ని వెంటనే నిలుపుదల చేయాలని మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, రాష్ట్ర కార్యదర్శి జి.రోహిత్ స్పష్టం చేశారు. రాష్ట్ర మానవ హక్కుల వేదిక సభ్యులు ఆదివారం కానుకొల్లు చేరుకుని నిజ నిర్ధారణ చేపట్టారు. అనుమతులు లేకుండా చేపట్టిన చెరువు తవ్వకాలను పరిశీలించి దళితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు తాగునీటికి ఇబ్బంది పడేలా గ్రామానికి ఆనుకొని రొయ్యల చెరువు తవ్వకం చేపట్టడం దారుణమన్నారు. సర్వే నెంబర్ 74, 75ల్లో ఉన్న భూమిలో అధికార పార్టీకి చెందిన సత్యనారాయణ ఎటువంటి అనుమతులు లేకుండా చెరువులను తవ్వేలా చర్యలు చేపట్టడం, అడ్డు వచ్చిన దళితులను పోలీసులతో బెదిరింపులకు పాల్పడడం సరైన పద్ధతి కాదన్నారు. స్థానికులను కులం పేరుతో దూషించడంపై ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రొయ్యల చెరువు తవ్వకాన్ని వెంటనే నిలుపుదల చేయాలని, బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు పాల్గొన్నారు.

ఎర్ర కాలువ జలాశయం నుంచి సాగునీరు విడుదల చేస్తున్న ఎంఎల్‌ఎ ఎలిజా

ఎర్ర కాలువ జలాశయం నుంచి సాగునీరు విడుదల

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎర్ర కాలువ జలాశయం నుంచి ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేసినట్లు ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. ఆదివారం మండలంలోని ఎర్ర కాలువ జలాశయం నుండి ఎడమ కాలువకు సాగునీటిని ఎంఎల్‌ఎ విడుదల చేసి మాట్లాడారు. సాగు నీరు విడుదల చేయడంతో చుట్టు పక్కల ప్రాంతాల్లోని పదివేల ఎకరాల్లో పంట పొలాలకు నీరు అందుతుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొదమ జ్యోతి, జెడ్‌పిటిసి పోల్నాటి బాబ్జి, ఎంపిటిసి కొయ్య రమాదేవి, వైసిపి నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్నీడి బాబి, రాజేష్, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

కావూరి ట్రస్టులో 17 నుంచి కంప్యూటర్, టైపు శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

కావూరి ఫౌండేషన్ కార్యాలయంలో ఈ నెల 17 నంచి కంప్యూటర్, టైప్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు పిఆర్ఒ పులి శ్రీరాములు ఆదివారం తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన వారికి టైపు, డిసిఎ, డిటిపి, ఇంటర్ కామర్స్ ఉత్తీర్ణులైన వారికి టాలీలో శిక్షణ ఇస్తారన్నారు. సంస్థ కార్యాలయం వద్ద ఈనెల 10 నుంచి 16 వరకూ దరఖాస్తులు అందజేస్తారన్నారు. ఏలూరు పరిసర మండలాల్లోని 18 నుంచి 35 సంవత్సరాల్లోపు యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విద్యారంగ సమస్యలపై ఉద్యమిద్దాం

ప్రజాశక్తి - ఏలూరు

విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష పధాన కార్యదర్శులు ఇ.భూషణం, కె.భాస్కర్ పిలుపునిచ్చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశం ఏలూరులో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కాకినాని అధ్యక్షత వహించారు. భూషణం, భాస్కర్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం విద్యను కాషాయీకరణ, ప్రయివేటీకరణ చేయడానికి నూతన విద్యా విధానం-2020 తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు పెరిగిన ధరలకనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహర్షి, ఉపాధ్యక్షులు వినోద్, సహాయ కార్యదర్శి క్రాంతి, నాయకులు గణేష్, జానకిరామ్, సునీల్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి శ్రీరామదుర్గప్రసాద్

'ప్రజా సంక్షేమానికి వైసిపి కృషి'

ప్రజాశక్తి - మండవల్లి

రాష్ట్ర అభివద్ధి, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటు పడే వ్యక్తి జగన్‌అని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గ ప్రసాద్ అన్నారు. మండలంలోని లింగాలలో శివాలయం రోడ్డును అభివృద్ధి చేసే విధంగా మండల పరిషత్ నిధులు రూ.ఆరు లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డుకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ జగన్ గ్రామాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. నిధులను కేటాయించి, మౌలిక వసతులు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నారన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, శ్రీ గంగా విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి వారి ఆలయం కార్యనిర్వహణ కార్యదర్శి సింగనపల్లి శ్రీనివాసరావు, ధర్మకర్త నాగరాజు, మెండ సురేష్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - పోలవరం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైన సంఘటన ఎల్ఎన్‌డి పేట శివారున ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పట్టిసీమ గ్రామానికి చెందిన కొత్తల సూర్యనారాయణ, అతని అల్లుడు పసలపూడి హరిబాబు పల్సర్ బైక్‌పై ద్వారకాతిరుమల వెళ్లారు. వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని, తలనీలాలు సమర్పించి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారుని తప్పించే క్రమంలో డిస్క్ బ్రేక్ వాడడంతో బైకు అదుపుతప్పి ఇద్దరూ కింద పడిపోయారు. కొత్తల సూర్యనారాయణకు తీవ్ర గాయాలు కాగా హరిబాబుకి స్వల్ప గాయాలయ్యాయి. అదే మార్గంలో వస్తున్న పత్రికా విలేఖరి ఆదిశేషు చొరవ చూపి వారిని ఎల్లండిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స చేయించి సహాయం అందించారు. పోలవరం నుంచి ఎల్లండి పేట కన్నాపురం రోడ్డు మార్గంలో పలుచోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉండడం, ఆ ప్రాంతాలలో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకుండా తుప్పలు పొదలు పెరిగి ఉండడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రహదారులు భవనాల శాఖ అధికారులు స్పందించి తుప్పలు, పొదలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయంపై పోలవరం ఆర్అండ్‌బి ఎఇఎస్‌కె కాజాని వివరణ కోరగా సిబ్బందిని పంపించి ప్రమాదకర మలుపులు ఉన్న ప్రాంతాల్లో తుప్పలు, పొదలు తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇసుక అక్రమ తరలింపు

రెండు ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - ముసునూరు

అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న రెండు టాక్టర్లను ముసునూరు మండల ఎస్ఐ ఎం.కుటుంబరావు పట్టుకున్నారు. ఆదివారం ఉదయం లోపూడి గ్రామ తమ్మిలేరులోని ఇసుకను అదే గ్రామానికి చెందిన రెండు టాక్టర్లలో నింపుకొని నూజివీడు డివిజన్ ఏరియా పరిధిలో గల గ్రామాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. ముసునూరు ఎస్ఐ తమ సిబ్బందితో కలిసి చాకచక్యంతో పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు ఇసుక టాక్టర్లును తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు

ఆర్‌టిసి బస్సు ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి - భీమడోలు

దమ్ము చక్రాలు గల ట్రాక్టర్ జాతీయ రహదారి దాటుతున్న సమయంలో ప్రమాదానికి గురై డ్రైవర్ గాయపడ్డారు. ఆదివారం తెల్లవారుజామున ఈ సంఘటన చోటు చేసుకుంది. భీమడోలు ఎస్ఐ చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దమ్ము చక్రాలతో టాక్టర్లు జాతీయ రహదారిపై ప్రయాణించటంపై నిషేధం ఉందన్నారు. దీనిని ఉపేక్షించిన పెదలింగంపాడు గ్రామానికి చెందిన టాక్టర్ డ్రైవర్ ఒకరు దమ్ము పనులు పూర్తైన తర్వాత అదే ట్రాక్టర్‌తో భీమడోలు నుంచి లింగంపాడు వెళ్లే క్రమంలో జాతీయ రహదారిపైకి వచ్చారు. దమ్ము కారణంగా వచ్చిన మట్టితో ట్రాక్టర్ ఇండికేషన్ లైట్లు కనపడని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు జాతీయ రహదారిపై ట్రాక్టర్ నెమ్మదిగా ప్రయాణిస్తుంది. ఈ నేపథ్యంలో కాకినాడ నుంచి శ్రీశైలం వెళ్తున్న ఆర్‌టిసి బస్సు డ్రైవర్ ఎదురుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను చీకట్లో గుర్తించలేకపోవడంతో ఆర్‌టిసి బస్సు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ రెండుగా విడిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.పోచమ్మ డిమాండ్ చేశారు. మండలంలోని ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం కోరుతూ మండల నాయకులు వై.విజయలక్ష్మి అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పోచమ్మ మాట్లాడుతూ ఆశా వర్కర్లను రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులని చెప్పి గౌరవవేతనం ఇస్తూ సంక్షేమ పథకాలు నిలిపివేసిందన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం అదనపు సౌకర్యాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు పనిభారంతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. పని చేయని ఫోన్లు ఇచ్చి పని చేయాలని ఒత్తిడి పెంచుతున్నారన్నారు. అనారోగ్యం పాలైతే సెలవు లేదని విమర్శించారు. రోజు రోజుకు స్థానిక సమస్యలు పెరుగుతున్నాయన్నారు. నెలలో అనేక సందర్భాల్లో సమావేశాల పేరుతో కనీసం టిఎ బిల్ ఇవ్వడం లేదని ఆశా డేలో మహిళలకు మౌలిక సౌకర్యాలు కూడా లేవన్నారు. వర్కర్లు అవస్థలు పడుతుంటే కొన్ని చోట్ల అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యల పరిష్కరించాలని లేని పక్షంలో రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్లు లక్ష్మి, అంజన దేవి, వనిత, రమాదేవి, మేరీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పోచమ్మ

ఎంపికైన మహిళా జట్టు

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళల జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహిళల క్రికెట్ జట్టు ఎంపిక ఆదివారం ఆశ్రం కళాశాల మైదానంలో జరిగాయి. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు జి.శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఈ ఎంపికలు సాగాయి. అండర్-15, అండర్-19, సీనియర్ మహిళా జట్లు ఎంపికలను పారదర్శకంగా నిర్వహించారు. వయస్సు ప్రాతిపదికన విభజించి బాలికలను వివిధ జట్లకు ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో బాలికలు, యువతులు సెలక్షన్స్‌కు హాజరయ్యారు. వారి తల్లిదండ్రుల రాకతో ఆశ్రం కళాశాల మైదానంలో సందడి వాతావరణం నెలకొంది. క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరాజు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎంపికైన వారు ఈనెల 21వ తేదీ నుంచి మంగళగిరి, పేరేచర్లలో జరిగే అంతర్ జిల్లా పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారు.

నేడు, రేపు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి -నూజివీడు రూరల్

తమ డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీ సిబ్బంది ఈనెల 10, 11 తేదీల్లో ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం నూజివీడులో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాజకుమారి మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది అందరూ ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చింతలపూడి ఎస్ఐగా ప్రసాద్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా కె.ప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో నిడదవోలు, లక్కవరం, ఏలూరు టూ టౌన్ ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చింతలపూడి ఎస్ఐగా బదిలీ అయ్యారు. నేరాలు అదుపునకు ప్రజల సహకారం అవసరమని, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు.

తల్లిదండ్రులకు పోలీసుల హెచ్చరిక

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పిల్లల ప్రవర్తన, తీరు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని పట్టణ సిఐ ఎంవివిఎస్ఎన్.మూర్తి సూచించారు. నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆదివారం మాట్లాడుతూ పిల్లల క్రమశిక్షణ రాహిత్యం, విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేయడం, ఆన్‌లైన్ గేమింగ్, వ్యసనాల పట్ల తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. పట్టణంలో కొందరు యువకులు ఆన్‌లైన్ గేమింగ్‌లో తగువులు పడితే కౌన్సెలింగ్ అందించామన్నారు. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తమ పిల్లలను పర్యవేక్షిస్తూ ఉండాలని ఆయన తెలిపారు.

నేడు పలు గ్రామాల్లో 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి - ఉంగుటూరు

జగనన్న సురక్షా కార్యక్రమాన్ని సోమవారం కాగుపాడు, రావులపర్రు గ్రామాల్లో నిర్వహించనున్నారు. ఈమేరకు ఆయా సచివాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. కాగుపాడులో తహశీల్దారు ఎవి.రమణారావు, ఇఒఆర్‌పిడిఒ షంషుద్దీన్, రావులపర్రులో డిటి బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, ఇంఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు ఆధ్వర్యంలో అధికారులు పాల్గొంటారు.

హమాలీల సమస్యలపై పోరాడాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

హమాలీ కార్మికుల ఉపాధి రక్షణ భద్రతతో కూడిన చట్టం చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకటరావు తెలిపారు. ఏలూరు రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ కార్మికుల జనరల్‌బాడీ శనివారం గూడ్స్‌షెడ్ వద్ద బావుశెట్టి కేశవ అధ్యక్షతన నిర్వహించారు. వెంకటేశ్వరరావు, వెంకట్రావు మాట్లాడుతూ దేశంలో హమాలీలు అయిదు కోట్ల మంది ఉన్నారని, వారికి చట్టం చేసే వరకూ హమాలీలు సమరశీల ఉద్యమాలు చేపడతారని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో ఆగస్టు 9వ తేదీన విజయవాడలో జరుగుతున్న భారీ కార్మిక ప్రదర్శన, సదస్సుకు కార్మిక వర్గం కదలి రావాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం చట్టాలను పటిష్టం చేయటం మానేసి ఉన్న చట్టాలను అదానీకి, అంబానీకి అనుకూలంగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా 'క్విట్ - మోడీ, సేవ్ - ఇండియా' అనే నినాదంతో కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేయటం అప్రజాస్వామిక విధానమని, ప్రభుత్వ రంగాల పరిరక్షణ కోసం కష్టజీవుల వర్గం కదం తొక్కాలన్నారు. మోడీ విధానంలో మార్పులు లేకపోతే భవిష్యత్తు కార్యక్రమాన్ని తీవ్రతరం చేయడానికి కార్మిక వర్గం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చినారు. ఈ కార్యక్రమంలో కె.బాలాజీ, ఎం.పెద్దిరాజు, బి.ఏసు, కె.నాగబాబు, లక్ష్మణరావు, సూరిబాబు, నాగేంద్ర పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ జాతీయ సమావేశాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఈనెల 12న తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో నిర్వహించనున్న ఎంఆర్‌పిఎస్ జాతీయ సమావేశానికి ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు తరలి రావాలని రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా కోఆర్డినేటర్ కాశీ కృష్ణ ఆధ్వర్యంలో ఏలూరు నగరం గన్ బజార్ సెంటర్ వద్ద ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి ముఖ్య నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. ముఖ్యఅతిథి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ కోసం 29 సంవత్సరాల నుంచి కృషి చేస్తున్న కార్యకర్తలను, నాయకులను అభినందించారు. రాబోవు వర్షాకాల సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందని, జాతీయ సమావేశానికి ప్రతిఒక్క కార్యకర్త, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కాశీ కృష్ణ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ, ఎస్‌సిల్లో ఉన్న 59 ఉప కులాలకు 15 శాతం రిజర్వేషన్‌ని దామాషా ప్రకారం సమానంగా కేటాయించాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులపై చిత్తశుద్ధి ఉంటే రాబోవు వర్షాకాల సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నమ్మిన లక్ష్మీ, జుజ్జువరపు మేరీ, చాట్ల శౌరి, చదిమెల్ల బుజ్జి, చిగురుపాటి రోసి సియాజ్ అలీ ఎంఎస్‌పి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు

వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ముసునూరు

బంజరు భూములు సాగు చేసుకునే వాడికే హక్కు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో నూజివీడు నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్నిక నిర్వహించారు. సంఘం అధ్యక్షులు అబ్బూరి రంగారావు, ఉపాధ్యక్షులు చంచన నాగర్జున, ప్రధాన కార్యదర్శి బూరుగు బాబూరావు, సహాయ కార్యదర్శి బాణావంతు రాము, కోశాధికారి ప్రకాష్, కమిటీ సభ్యులు దిమ్మటి రంగరావు, జంపిన సుబ్బారావు, బాణావంతు తులసీరావ్, రాజలపాటి శ్రీను, పల్లె ప్రకాశరావు, గండికోట నాగేశ్వరరావు, కర్రా రామకృష్ణ, తాళ మహేష్, నక్కా కుమార్‌బాబు, మహిళ కమిటీ సభ్యులు ఆమ్‌గోత్ తిరుపి, జంగం మేరీకుమారి ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పేదలు సాగు చేసుకుంటన్న భూములకు పట్టాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పనిదినాలు వంద రోజుల నుంచి రెండొందల రోజులకు పెంచాలని, రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలని, రెండు పూటలా పని రద్దు చేయాలని కోరారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ ఇన్‌ఛార్జిగా సౌజన్య

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఆమ్ ఆద్మీ పార్టీ ఇన్‌ఛార్జీగా లింగాల సౌజన్యను ఆదివారం నియమించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ ఆర్‌కె ఫాతిమా, ఏలూరు జిల్లా అధ్యక్షుడు చల్లగుళ్ల సురేష్ బాబు, జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చల్లగుళ్ల సురేష్ బాబు మాట్లాడుతూ అవినీతి అంతం, ఆమ్ ఆద్మీ పంతం అని ఆయన అన్నారు.

డ్రైయినేజీల పూడిక తీత పనులు

ప్రజాశక్తి - పోలవరం

జగన్నాథ పేట నుంచి కడమ్మ కాలువకు వెళ్లే మేజర్ డ్రైయినేజీల పూడిక తీత పనులు సర్పంచి పొడుం పుష్ప ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మేజర్ డ్రైయినేజీలు పూడుకుపోయాయి. ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలవ ఉండి, మురుగు నీరు, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్పందించిన సర్పంచి డ్రైయినేజీల పూడికతీత పనులను స్వయంగా పర్యవేక్షించి చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు, సిబ్బంది బంగారు కృష్ణ, వారా పోశియ్య, వెంకటరత్నం, మాడుగుల సాయి, సామూయేలు పాల్గొన్నారు.

డ్రైయినేజీలో పూడిక తీత పనులు

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ఏలూరు అర్బన్ :స్థానిక న్యూ అశోక్ నగర్ హేలాపురి లయన్స్ మల్టి సర్వీస్ సెంటర్‌లో హేలాపురి లయన్స్ సర్వీస్ ట్రస్ట్ సహకారంతో పేదలకు ఉచిత డయాబెటిక్, మెడికల్ క్యాంపును హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు కెబి.రావు, సెక్రటరీ బొల్లా సత్యనారాయణ, కోశాధికారి దేవినేని రమాదేవి నిర్వహణలో సుమారు 150 మందికి ఉదయం రెండుసార్లు మధుమేహ పరీక్షలు, రక్తపోటు పరీక్ష నిర్వహించారు. అల్పాహారం అందజేసి, నెలకు సరిపడా రూ.40 వేలు విలువైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ కానుమిల్లి పృథ్వీ నరేష్ రోగులకు సేవలందించారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా నాయకులు ఎల్.వెంకటేశ్వరరావు, దువ్వి హేమసుందర్, సభ్యులు ఆర్.పద్మకుమారి, అమరశ్రీ, మాధవి మెడికల్స్ ఎం.కృష్ణమోహన్, కిరణ్, ఏలైట్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వరరావు, సిహెచ్.రాంబాబు పాల్గొన్నారు.

దళిత ద్రోహి అనంతబాబు : టిడిపి

ప్రజాశక్తి - కుక్కునూరు

దళిత వర్గానికి చెందిన తన డ్రైవర్‌ని చంపి డోర్ డెలివరీ చేసిన ఎంఎల్‌సి అనంతబాబు దళిత ద్రోహి అని టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ఆరోపించారు. ఒక హంతకుడిగా నిందా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి సభ ఏర్పాటు చేస్తే పోలీసులు ఏ విధంగా అనుమతి ఇచ్చారని బొరగం ప్రశ్నించారు. ఆదివారం రంపచోడవరం నియోజకవర్గం కూనవరంలో అనంతబాబు సభ ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆసభను అడ్డుకోవడానికి బొరగం శ్రీనివాసులు నేతృత్వంలో మండలం నుంచి పెద్దఎత్తున టిడిపి శ్రేణులు తరలి వెళ్లారు. వీరిని ఎటపాక పోలీసులు నెల్లిపాక వద్ద అదుపులోకి తీసుకుని స్టేషన్‌కి తరలించారు. బొరగంతో పాటు అరెస్టైన వారిలో టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, రంపచోడవరం నియోజకవర్గ కన్వీనర్ వంతల రాజేశ్వరి, కుక్కునూరు టిడిపి మండల అధ్యక్షులు ముల్లిశెట్టి నాగేశ్వరరావు, వెలేరుపాడు మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు కోటగిరి సత్యనారాయణ, ఉప సర్పంచి పిచ్చుక రాజు, కె.అప్పలరాజు, లంకాల రాజు ఉన్నారు. కూనవరంలో జరుగుతున్న అనంతబాబు సభను అడ్డుకునేందుకు వెళుతున్న పోలవరం టిడిపి కన్వీనర్ బొరగం, కుకునూరు టిడిపి నాయకులను అరెస్టు చేసి నెల్లిపాక స్టేషన్.కు తరలించారు.

టి.నరసాపురం: టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజును అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్యని చింతలపూడి మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ రామకృష్ణ ఖండించారు. మండలంలోని బందంచర్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన ముద్దాయి ఎంఎల్‌సి అనంత బాబుకు తూర్పు గోదావరి జిల్లాలో పబ్లిక్ మీటింగ్‌కు అనుమతి ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ మీటింగ్‌ను అడ్డుకోవడానికి వెళ్లిన రాజును, దళిత నాయకులను అరెస్టు చేయడం నీచమైన చర్య అన్నారు. ఎంఎల్‌సి అనంత బాబు కౌన్సిల్ సభ్యత్వం రద్దు చేసి దళిత నాయకులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఘంటసతీష్, ఆచంట గోపాల రావు, పెద్దిన సత్యనారాయణ, నార్ని వెంకట్రావు, పాపాచార్యులు వీరేశలింగం, కాసన్నేని మాధవ రావు, పేరం రాంబాబు, ఓబిళ్లనేని రాంబాబు, పెద్దిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టి.నరసాపురం మండలంలోని బందంచర్లలో మాట్లాడుతున్న నాయకులు

'టిడిపి నేతల అరెస్టులు అక్రమం'

ప్రజాశక్తి - పోలవరం

టిడిపి ఇన్‌ఛార్జ్ బొరగం శ్రీనివాసులు, ఇతర టిడిపి నాయకుల అరెస్టులు అక్రమమని టిడిపి పోలవరం మండల నాయకులు, మాజీ ఉపసర్పంచి మంగినకొండ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన నివాసం వద్ద పత్రికలతో మాట్లాడుతూ రంపచోడవరం మండలం నెల్లిపాక వద్ద ఎంఎల్‌సి అనంత బాబు నిర్వహిస్తున్న సభకు వెళుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొరగం శ్రీనివాసులుని, రాష్ట్ర ఎస్‌సి సెల్ నాయకులు ఎమ్మెస్ రాజు, రంపచోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరిలను కూనవరం పోలీసులు అరెస్టు చేయడం అక్రమమని, అమానుషమని అన్నారు. ఎన్నికలు రాకమునుపే వైసిపి నాయకులలో ఓటమి భయం పట్టుకుందని, అందుకే టిడిపి నాయకులు చేస్తున్న బహిరంగ సభలను, పాదయాత్రలను అడ్డుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ఎంఎల్ఏను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా ఎంఎల్ఎ డిఎన్ఆర్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - కైకలూరు

ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆక్వా వ్యాపారులు, అధికారులు పాల్గొని ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ డైరెక్టర్ గంటా సంధ్య, క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, నాలుగు మండలాల ఎంపిపిలు, జడ్‌పిటిసి సభ్యులు, పలు విభాగాల నాయకులు సయ్యపరాజు గుర్రాజు, ముంగర నరసింహారావు, పాల్గొన్నారు.

రాజశేఖర్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ముదినేపల్లి

కొత్తపల్లి దళితవాడకు చెందిన దారం రాజ్‌కుమార్ ఇటీవల మృతి చెందారు. ఆయన మృతదేహానికి రాష్ట్ర మాల మహానాడు అనుబంధ సంఘాల అధ్యక్షుడు డాక్టర్ సేవానాగ జగన్ బాబూరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్ కుమార్ తల్లి దారం లక్ష్మీ కాంతమ్మని ఆదివారం పరామర్శించారు. రాజ్‌కుమార్ కొన్నిరోజుల క్రితం చేపల ప్యాకింగ్‌కి వెళ్లి లారీ మీద నుంచి పడిపోయారు. హాస్పిటల్లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందారు. కుటుంబాన్ని పరామర్శించిన వారిలో బాబూరావు, కొత్తపల్లి గ్రామ పెద్దలు, అంబేద్కర్ యూత్ కమిటీ సభ్యులు, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

జనసేన సభకు తరలిన అభిమానులు

ప్రజాశక్తి - భీమడోలు

జనసేన నాయకులు పవన్ కళ్యాణ్ ఏలూరు రాక సందర్భంగా భీమడోలు నుంచి జనసేన కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా భీమడోలు పురవీధుల్లో ఆదివారం సాయంత్రం పార్టీ మండల శాఖ అధ్యక్షులు పత్తి మదన్ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జనసేన వీర మహిళ భీమన దుర్గా పల్లవి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నినాదాలు చేస్తూ జనసేన కార్యకర్తలు ఏలూరు సభకు తరలి వెళ్లారు.

'శ్రేష్ట'లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెదతాడేపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు శ్రేష్ట ప్రవేశ పరీక్షలో 75 సీట్లు సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు ఆదివారం ఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సి విద్యారుల్లో ప్రతిభను గుర్తించి ప్రయివేట్ పాఠశాలల్లో సీట్లు కల్పించి చదివించే నదుపాయం ఏర్పాటు చేయడం శ్రేష్ట ముఖ్య ఉద్దేశన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ జస్టిస్ ఎన్‌పవర్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కీమ్ ఫర్ రెసిడెన్సియల్ ఎడ్యుకేషన్ ఎస్‌సి స్టూడెంట్స్ ఇన్ హైస్కూల్ టార్గెటెడ్ ఏరియా (శ్రేష్ట) ఈ ప్రవేశ పరీక్షకు గురుకుల పాఠశాల నుంచి 104 మంది విద్యార్థులు హాజరవ్వగా అందరూ అర్హత సాధించారన్నారు. దీనిలో మూడు వేల లోపు ర్యాంకు వచ్చిన వారికి సీట్లు లభిస్తాయన్నారు. దీనిలో భాగంగా ఎనిమిదో తరగతికి చెందిన కత్తుల రిచర్డ్‌సన్ జైన్ ఆల్ ఇండియా లెవల్‌లో 431వ ర్యాంక్, ఆర్.విశ్వనాథ్ 605వ ర్యాంక్, ఎన్ఎం.వినయ్ 635వ ర్యాంక్ సాధించగా పదో తరగతికి చెందిన విద్యార్థి వై.దన్వంత్ 615 వ ర్యాంక్ సాధించారన్నారు. 75 సీట్లు సాధించిన వి ద్యార్థులందరికీ ఆంధ్రప్రదేశ్, క ర్ణాటక, తమి ళనాడు, తెలం గాణ, మహారాష్ట్ర, ఒడిశా, కేరళ, చత్తీష్‌గఢ్ తదితర రాష్ట్రాల్లోని ప్రయివేట్ పాఠశాలల్లో సీట్లు లభిస్తాయని ప్రిన్సిపల్ తెలిపారు. అత్యంత ప్రతిభ కనపరచిన విద్యార్థులను డిఇఒ ఎన్.భారతి, ప్రిన్సిపల్ రాజారావు, వైస్ ప్రిన్సిపల్ బి.ప్రతాప్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.



ఆర్.విశ్వనాథ్